ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 కర్ణాటక వార్తలు


శుక్రవారం 22 ఆగస్టు 2025

బాలల హక్కులను **కాపాడండి**

● బాల్య వివాహాలను అరికట్టాలి: న్యాయాధికారి రాజేశ్ హొసమనే 8

గణేష్ విగ్రహాల ఏర్పాటుకు **అనుమతి తప్పనిసరి**

● శాంతి సభలో ఎస్పీ శోభారాణి



సభాపతి బసవ రాజహొరట్టి

45 సంవత్సరాల ప్రస్థానం

● 1980లో ప్రవేశం

● 8సార్లు వరుసగా ఎమ్మెల్సీ

● 17 మంది సీఎంలతో కలిసి సేవ

● 43ఏళ్లుగా ఎల్‌హెచ్ 465వ గదిలోనే..

● రికార్డు సృష్టించిన బసవరాజ హొరట్టి

బెంగళూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసన సభలో అత్యంత సీనియర్‌గా పేరొంది సభాపతి స్థానంలో కొనసాగుతున్న బసవరాజ హొరట్టి పరిషత్ సభ్యుడిగా 45ఏళ్ల పూర్తి చేసుకుని సరికొత్త రికార్డును నమోదు చేశారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖతోపాటు ప్రజా సమస్యలంటే ఆయన ఎక్కువ ఆసక్తి కనబరచి చర్చించేవారనే పేరొందారు. సాధారణంగా ఆయన మాటతీరు, వ్యక్తిత్వం, ముక్కుసూటి, ఖచ్చితత్వం పాటిస్తారనే పేరున్నా ఏళ్ల తరబడి చూసిన వారికి ఆయనలో ఎటువంటి మార్పు లేదని పరిషత్‌లో 45ఏళ్ల కొనసాగినా సాదాసీదాగా ఉంటారనే అభిప్రాయం ఉంది.

హుబ్బళ్ళి - ధారవాడ ప్రాంతానికి చెందిన బసవరాజహొరట్టిని అక్కడి ప్రజలు హొరట్టి మాస్టార్‌గాను పిలుస్తారు. 1980లో ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ప్రయాణాన్ని ప్రారంభించిన ఆయన వరుసగా 8సార్లు ఉపాధ్యాయ నియోజకవర్గ ప్రతినిధిగానే పరిషత్ సభ్యుడిగా కొనసాగారు. ఈ ఏడాది జూన్ 30నాటికి హొరట్టి పరిషత్‌లో ప్రవేశించి 45ఏళ్ల నిండింది. 2028 వరకు ఆయన పరిషత్ సభ్యుడిగా కొనసాగుతారు. లెజిస్లేచర్ హౌస్ (ఎల్‌హెచ్)లో 43ఏళ్లుగా 465 చాంబర్‌లోనే కొనసాగుతున్నారు. మంత్రిగా, ప్రస్తుతం పరిషత్ సభాపతిగా ఉన్నా ఆ గదిని వీడలేదు. ప్రస్తుత రాజకీయాలను పరిశీలిస్తే ఆర్థిక, కులబలం తప్పనిసరిగా ఉండాలనే ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యే తరహాలోనే పరిషత్‌కు పోటీ చేయాలన్నా ఇటు పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకోవడంతోపాటు ఎన్నికలలోనూ భారీగా ఖర్చు పెట్టాలి. ఉపాధ్యాయులైనా, పట్టభద్రులైనా వారికి సౌలభ్యాలు, ఇతరత్రా సమకూర్చకపోతే గెలుపొందడం అంత సులువేమీ కాదు. అయినా ఒకే స్థానం, ఒకే ప్రాంతం నుంచి పరిషత్‌సభ్యుడిగా గెలుపొందుతూ వచ్చారు. ఇది నిజంగా ఆయన సంపాదించిన ప్రజాభిమానంగా చెప్పవచ్చు.



ఎమ్మెల్యేల క్వార్టర్స్‌లో హొరట్టి గది

నాడు జనతా పరివార్ నుంచి నేడు బీజేపీ దాకా..

జనతా పరివార్ నుంచి ప్రారంభమైన ఆయన రాజకీయం అనూహ్యంగా మార్పులు చోటు చేసుకుంది. సుదీర్ఘకాలం ఆయన జేడీఎస్ పార్టీలో కొనసాగుతూ వచ్చారు. ఏడుసార్లు జేడీఎస్ నుంచే గెలుపొందారు. అయితే మూడేళ్ల క్రిందట రాష్ట్రంలో జేడీఎస్ పరిస్థితి దారుణంగా ఉండడం, పైగా బీజేపీ అధికారంలో ఉండడంతో జేడీఎస్‌కు గుడ్‌బై చెప్పి 2022 ఎమ్మెల్సీ ఎన్నికల వేళ బీజేపీలో చేరారు. కానీ అనూహ్యమైన రాజకీయ పరిణామాలతో 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ-జేడీఎస్‌లు మైత్రి ఏర్పాటు చేసుకున్నాయి. ప్రస్తుతం సభాపతిగా ఉన్నందున రాజకీయ పార్టీలతో సంబంధం ఉండదు. కానీ ఆయన బీజేపీ ఎమ్మెల్సీగా ఉన్నారు. గతంలోనూ పలుమార్లు బీజేపీ-జేడీఎస్, కాంగ్రెస్ - జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వాలు కొనసాగాయి. అప్పుడు హొరట్టికి ఎటువంటి ఇబ్బంది కలగలేదు. హొరట్టి రాజకీయాలను అధిగమించి సొంత వర్చస్సుతోనే గెలుపొందుతూ వస్తుండడంతో ఆయనకు ఉపాధ్యాయుల నుంచి నిరంతర ఆదరణ లభిస్తోంది. విద్యారంగంలో మార్పులు, ఉపాధ్యాయుల సమస్యలుంటే పార్టీ ఏదైనా చివరకు సభాపతిగా కొనసాగుతున్నా ప్రత్యేక దృష్టి సారిస్తారు.

నిక్కచ్చిగా వ్యవహరించడమే ఆయన నైజం

పరిషత్‌సభ్యుడిగా హొరట్టి ప్రతిపక్ష, అధికార పక్షంలోనూ పనిచేసిన అనుభవం ఉంది. గతంలో విద్యాశాఖ మంత్రిగాను కొనసాగారు. 45ఏళ్లలో 17మంది ముఖ్యమంత్రులతో కలసి పనిచేసిన అనుభవం ఉంది. రామకృష్ణ హెగ్డే ఆదర్శాలతో రాజకీయాల్లోకి వచ్చిన హొరట్టి కూడా నైతిక విలువలతో కూడిన రాజకీయాలపై నమ్మకం కలిగి ఉన్నారు. జనతా పరివార్ విభజన తర్వాత రామకృష్ణ హెగ్డే, ఎస్‌ఆర్ బొమ్మై, జేహెచ్ పటేల్‌ల కాలంలోనూ జేడీఎస్‌లోనే హొరట్టి కొనసాగారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ, కుమారస్వామిలతోనూ కలసి పనిచేశారు. ధరంసింగ్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో తొలిసారి మంత్రి అయ్యారు. ఆ తర్వాత కుమారస్వామి కేబినెట్‌లో తనకు ఇష్టమైన విద్యాశాఖ మంత్రిగా కొనసాగారు. ఉత్తర కర్ణాటక అభివృద్ధి విషయంలో ఆయన ధ్వని నిరంతరంగా సభలో వినిపించింది. నాలుగున్నర దశాబ్దాల కాలంలో అజాతశత్రువుగా గుర్తింపు పొందారు. ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్దరామయ్యతోనూ సన్నిహితంగానే ఉంటున్నా ఏమాత్రం ప్రభుత్వానికి మృదువుగా ఉంటారనేది లేదు... సమయం వచ్చినప్పుడు సర్కారుపై తీవ్రస్థాయిలోనే మండిపడతారు. గత బీజేపీ ప్రభుత్వంలోనూ ఇదే తరహాలో వ్యవహరించారు. ప్రస్తుత కలుషిత రాజకీయాలు, సభా కలాపాల వేళ వృథా చేయడాన్ని హొరట్టి క్షమించేవారు కాదు. పార్లమెంటరీ వ్యవస్థ అంటే చర్చించాలి, అభిప్రాయాలు వ్యక్తం చేయాలి, ప్రభుత్వం నుంచి ఒక పరిష్కార మార్గం పొందాలిగానీ వాయిదాలు వేస్తామంటే సహించేవారు కాదు. మంత్రిగా, సభాపతిగా కొనసాగిన హొరట్టి రాష్ట్ర రాజకీయాలకే కాకుండా దేశంలోనూ ఓ అపార అనుభవం కలిగిన నేతగా రాణిస్తున్నారు. బహుశా దేశంలో 45ఏళ్లపాటు ఎమ్మెల్సీగా కొనసాగినవారు ఉన్నారనేది అంతుచిక్కని విషయం.

బీఎంటీసీ బస్సు ఢీకొని చిన్నారి దుర్మరణం

● వారం రోజుల్లో నలుగురు మృత్యువాత

● ఆర్టీసీ అధికారులపై స్థానికుల ఆగ్రహం

బెంగళూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : బీఎంటీసీ బస్సు ఢీకొని యలహంక పరిధిలోని కోగిలు క్రాస్ వద్ద 10 ఏళ్ళ విద్యార్థిని దుర్మరణం చెందారు. గురువారం ఉదయం ఓ తల్లి ఇద్దరు పిల్లలను పాఠశాలలో వదిలేందుకు బయలుదేరారు. కోగిలు క్రాస్ వద్దకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పింది. దీంతో ఇద్దరు చిన్నారులతో పాటు తల్లి కిందపడ్డారు. వెనుక నుంచి వేగంగా వచ్చిన బస్సు విద్యార్థిని పైనుంచి దూసుకుపోవడంతో తలచిద్రమై అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ఇద్దరు తప్పించుకున్నారు. మృతి చెందిన విద్యార్థిని తన్విక్రిష్ణ(10) గుర్తించారు. యలహంక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వారం రోజుల్లో ఇది నాల్గవ ప్రమాదం కాగా నలుగురు దుర్మరణం చెందారు. ఈనెల 13న రూపేన అగ్రహారలో బీఎంటీసీ బస్సు కింద పడి బైక్ రైడర్ సయ్యద్ జాఫర్ మృతి చెందారు. ఇక సంజయ్‌నగర్‌లో బైక్‌పై వస్తున్న రోషన్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఓవర్ టేక్‌కు ప్రయత్నించి ప్రమాదానికి గురై మృతి చెందారు. కాగా బుధవారం జయనగర్‌లో ఉదయం సిటీ మార్కెట్‌లో పనిచేసే కూలీపై బస్సు దూసుకు పోవడంతో సంపంగి(64) దుర్మరణం చెందారు. బీఎంటీసీ బస్సుల ప్రమాదాలపై నగర ప్రజలు మండిపడుతున్నారు.

ఉభయ సభల్లో కీలక బిల్లులకు ఆమోదం



సభలో సీఎం, డీసీఎం

● రాత్రి 12 దాకా సమావేశాలు.. సభ్యులకు సభాపతి అభినందనలు

బెంగళూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : శాసనసభ కలాపాలలో భాగంగా గురువారం ఉభయసభలలోను పలు కీలక బిల్లులకు ఆమోదం తెలిపారు. హోంమంత్రి పరమేశ్వర్ కర్ణాటక జనసంధణి నియంత్రణ బిల్లుతో పాటు భూకందాయ రెండో సవరణ బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టారు. అక్రమ గనులకు సంబంధించిన అక్రమాలపై కఠినతరమైన కేసులు నమోదు చేసేలా బిల్లును ప్రవేశపెట్టారు. విద్యుత్‌శాఖా మంత్రి కేజే జార్జ్ లిఫ్ట్, ఎ స్కలేటర్‌లు, ప్యాసింజెర్ కన్వేయర్ బిల్లును ప్రవేశపెట్టారు. రాష్ట్ర సంప్రదాయ గొర్రెల పెంపకం దారుల క్షేమాభివృద్ధి, దౌర్జన్యాలు, రక్షణ కల్పించే సవరణ బిల్లును మంత్రి భైరతీ సురేష్ ప్రవేశపెట్టారు. విధానపరిషత్‌లోను పలు బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదించారు. విధానసభలో అంగీకరించిన బిల్లులు పరిషత్ ముందుకు వచ్చాయి. మున్సిపల్ వ్యవహారాల సవరణ బిల్లును ఆమోదించారు. గ్రేటర్ బెంగళూరు అథారిటీ బిల్లు పరిషత్‌లోను ఆమోదం లభించింది. ఉదయం నుంచి రాత్రి దాకా ఉభయసభలలోను బిల్లులకు ఆమోదం పలికారు. కాగా బుధవారం రాత్రి 12గంటల దాకా కలాపాలు నిర్వహించేలా సహకరించిన ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో పాటు మంత్రులు, పరిషత్ సభ్యులకు సభాపతి బసవరాజహొరట్టి అభినందించారు.



మాట్లాడుతున్న ప్రతిపక్షనేత అశోక్

నన్నెందుకు టార్గెట్ చేస్తున్నారు?

● ఉండాలా వెళ్లిపోవాలా : ఎమ్మెల్యే శరణుగౌడ కందుకూరు

● ఒకే వెళ్లిపో అన్న స్పీకర్... శాసనసభలో గందరగోళం



ఎమ్మెల్యే శరణుగౌడ కందకూరు

బెంగళూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖకు సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టిన వేళ జేడీఎస్ పార్టీ గురుమిట్కల్ ఎమ్మెల్యే శరణుగౌడ కందకూరు ఏకంగా స్పీకర్‌పై విరుచుకుపడ్డారు. గురువారం శాసనసభలో చర్చ సాగుతున్న వేళ ఎమ్మెల్యే శరణుగౌడ మాట్లాడుతుండగా స్పీకర్ యూటీ ఖాదర్ ఒకటి రెండు సార్లు కేవలం సబ్జెక్టుకు సంబంధించి మాత్రమే మాట్లాడాలని ప్రసంగాలు వద్దంటూ సూచించారు. దీంతో ఒక్కసారిగా ఆగ్రహానికి లోనైన శరణుగౌడ నేరుగా స్పీకర్ తీరుపై మండిపడ్డారు. తననెందుకు టార్గెట్ చేస్తున్నారని తరచూ ఇదే జరుగుతోందని మండిపడ్డారు. నేను ఏమైనా మా ఇంటి కోసం మాట్లాడుతున్నానా అంటూ నిలదీశారు. స్పీకర్ సముదాయించేందుకు ప్రయత్నిస్తున్నా సభ్యుడు మరింత ఆవేశపడ్డారు. సభలో ఉండాలా వెళ్ళిపోవాలా అంటూ నిలదీశారు. ఒకే వెళ్ళిపో అంటూ స్పీకర్ కూడా వ్యాఖ్యానించారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అంతలోనే ఒకరిద్దరు సీనియర్ ఎమ్మెల్యేలు శరణుగౌడ వద్దకు వెళ్ళి సముదాయించారు. బీజేపీ, జేడీఎస్ పార్టీ ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని ఒక వేళ సభ్యుడు ఉండాలా వెళ్ళిపోవాల అంటూ మీరు కూడా ఒకే అనడం సరికాదన్నారు. చివరకు ఎమ్మెల్యేల సర్దుబాటుతో సభ శాంతించినట్లు అయ్యింది.

కృష్ణా నదికి వరద ఉధృతి



నీట మునిగిన హువినహడగి వంతెన 7

వయనాడుకు రూ.పది కోట్ల విరాళం

● రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనపై ప్రతిపక్షనేత అశోక్ మండిపాటు ● ప్రియాంకగాంధీ మెప్పుకోసమే అంటూ వ్యాఖ్యలు

బెంగళూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం వయనాడు జిల్లాకు కర్ణాటక ప్రభుత్వం పదికోట్లు విరాళం ప్రకటించడాన్ని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ పార్టీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. 2024-25 ఏడాదికి సంబంధించి బడ్జెట్ బిల్లు శాసనసభ ముందుకు వచ్చిన వేళ పదికోట్ల ప్రత్యేక గ్రాంటు అంశం గురువారం వెలుగులోకి వచ్చింది. వయనాడులో గత ఏడాది భూమికుంగిపోయిన ప్రాంతంలో ఇళ్ళ నిర్మాణాలకు ఎస్‌డీఆర్‌ఎఫ్ ద్వారా పదికోట్లు ప్రకటించారు. ఇందుకు ప్రతిపక్షనేత అశోక్ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. కేరళ సీఎం సిద్దరామయ్యకు ధన్యవాదాలని కర్ణాటకకు ఇటువంటి సీఎం ఉంటే అన్ని నియోజకవర్గాలు అభివృద్ది చెందేవని ఎద్దేవా చేశారు. కన్నడిగులు దురదృష్టవంతులని మళియాళీలు అదృష్టవంతులని మండిపడ్డారు. రాష్ట్రంలో అభివృద్దికి నిధులు లేవనే ముఖ్యమంత్రి కేరళ రాష్ట్రం ప్రత్యేకించి ప్రియాంకగాంధీ ప్రాతినిథ్యం వహించే వయనాడు అంటే ఎనలేని అభిమానం చూపుతున్నారన్నారు. ఇది మానవత్యం కాదని వెట్టిచాకిరీ లాంటిదే అన్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ఏనుగు దాడి చేసి వయనాడు వ్యక్తి మృతి చెందితే రూ.15లక్షల పరిహారం ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇదేమి గాంధీ కుటుంబానికి చెందిన రాజకీయ సంపద కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర విధానసౌధలో మీడియాతో మాట్లాడుతూ మా పన్నులు మా హక్కు అంటూ ఢిల్లీలో ఆందోళన చేసే ముఖ్యమంత్రి కర్ణాటక ప్రజలు చెల్లించిన పన్నుల సొమ్మును కేరళకు ప్రత్యేకించి వయనాడుకు ఎందుకు ప్రత్యేక గ్రాంట్‌ల రూపంలో ఇస్తున్నారని మండిపడ్డారు.

బెళ్తంగడిలో హైడ్రామా..!

● వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మహేష్ తిమరోడి అరెస్ట్ ● పోలీసులకు అడ్డు తగిలిన అనుచరులు

బెంగళూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : బీజేపీ అగ్రనేత బీఎల్ సంతోష్ పట్ల అనుచితంగా మాట్లాడిన మేరకు నమోదైన కేసులో ధర్మస్థలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న మహేష్‌శెట్టి తిమరోడిను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఎఫ్ఐఆర్‌కు అనుగుణంగా ఏఎస్పీ స్థాయి అధికారితో పాటు ఉడుపి జిల్లా బ్రహ్మావరకు చెందిన పోలీసులు సుమారు 30మంది తిమరోడి నివాసం వద్దకు చేరుకున్నారు. తనను ఎందుకు అరెస్టు చేయాలని ప్రయత్నిస్తున్నారంటూ ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఇదే సందర్భంలోనే పెద్దఎత్తున ఆయన అనుచరులు, ధర్మస్థలను వ్యతిరేకిస్తున్న వారంతా అక్కడికి చేరుకున్నారు. ఇదే సందర్భంలోనే తిమరోడి మాట్లాడుతూ తనకు ఏదైనా జరిగితే అందుకు ప్రభుత్వ పెద్దలతో పాటు బీజేపీ వారే కారణమన్నారు. తప్పుడు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకుని హింసించాలని కుట్రపన్నారన్నారు. కాగా తిమరోడి 2012లో ధర్మస్థలలో విద్యార్థిని సౌజన్య హత్య కేసుతో పాటు సిట్ విచారణలు, ధర్మస్థళ మంజునాథస్వామి ఆలయానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాతో పాటు పలు చానల్స్‌లను తీవ్ర పదజాలంతో దూషించిన విషయం తెలిసిందే. బీజేపీ జాతీయ నేత బీఎల్ సంతోష్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మేరకు బ్రహ్మావర పోలీసుస్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. సుమారు గంటకు పైగా పోలీసులతో తిమరోడితో పాటు ఆయన తరుపు వారు ఎందుకు అరెస్టు చేస్తున్నారని వారెంట్‌లు ఉన్నాయా అంటూ నిలదీశారు. చివరకు పోలీసులు కేసు వివరాలు తెలిపిన మేరకు స్టేషన్‌కు వచ్చేందుకు అంగీకరిస్తూనే ప్రైవేటు వాహనంలో వస్తానంటూ మెలిక పెట్టారు. ఆయన వెంట గిరీష్ మట్టణనవర్ కూడా ఉన్నారు. బీఎల్ సంతోష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మేరకు ఉడుపి జిల్లా బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందుకు అనుగుణంగానే తిమరోడికి రెండుసార్లు పోలీసులు నోటీసులు జారీ చేసినా హాజరు కాలేదు. దీంతో బుధవారం మరోసారి నోటీసులు జారీ చేసిన పోలీసులు గురువారం ఉదయం 9గంటలకు హాజరుకావాలని సూచించారు. కానీ తిమరోడి ఇప్పుడు రాలేనని 15 రోజుల గడువు కావాలని తెలిపిన మేరకు పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు వచ్చారు. తిమరోడిపై బెయిల్ రహిత కేసులు ఉన్నాయని ఉడుపి ఎస్పీ హరిరామ్ శంకర్ తెలిపారు. దాదాపు మూడుగంటల పాటు విచారణలు జరిపిన పోలీసులు అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం వైద్య పరీక్షలు జరిపించి బ్రహ్మావర మెజిస్ట్రేట్ ముందుకు తీసుకెళ్ళారు.



మహేష్‌శెట్టి తిమరోడి, పోలీసులను అడ్డుకుంటున్న అనుచరులు



గార్మెంట్స్ ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

నోటీసు లేకుండా తొలగిస్తారా..?

● గార్మెంట్ పరిశ్రమలో కార్మికుల తొలగింపుపై నిరసన

● ఉన్నఫళంగా పొమ్మంటే బతికేదెలా అంటూ ఆగ్రహం 7

పాఠశాలల మూసివేతపై విద్యార్థుల ఆగ్రహం

● ఫ్రీడం పార్క్‌లో భారీ నిరసన



ఫ్రీడం పార్క్ నిరసనలో విద్యార్థులు

గణేష్ ఉత్సవాలకు ఆన్‌లైన్‌లో అనుమతి

● ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ నేపథ్యంలో గణేష్ ఉత్సవ విగ్రహాలు, మండపాల ఏర్పాటు అనుమతి కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ganeshutsav.net. వెబ్‌సైట్ ప్రారంభించినట్లు ఎస్పీ జగదీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఈ వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో అనుమతులు పొందాలన్నారు. ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా ఈ వెబ్‌సైట్ సేవలను వినియోగించుకోవాల న్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత పోలీస్ అధికారి మండపస్థలాన్ని తనిఖీ చేసి, నిబంధనల మేరకు ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తారన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు ఈ అనుమతులు తప్పనిసరి అంటూ ఆయన పేర్కొన్నారు.

లీప్‌యాప్‌లోనే బదిలీ దరఖాస్తు: డీఈఓ

అనంతపురం విద్య, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అంతర్‌జిల్లా బదిలీలకు టీచర్లు లీప్ యాప్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం అంతర్‌జిల్లా బదిలీలకు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. ఆ మార్గదర్శకాల మేరకు స్పౌజ్, మ్యూచువల్ ప్రతిపాదన కింద లీప్‌యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 24వరకు బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అప్లై చేసిన దరఖాస్తులను ఈనెల 24కి ఆయా ఎంఈఓలకు అందజేయాలన్నారు. ఎంఈఓలు ఈనెల25లోగా వాటిని పరిశీలించి డీఈఓ కార్యాలయానికి పంపాలన్నారు. వాటిని ఈనెల 26లోగా పరిశీలించి, రాష్ట్రశాఖకు పంపుతామన్నారు. అర్హతలు, మార్గదర్శకాలను డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ వెల్లడించారు.

బీఎస్ఎన్ఎల్ కొత్త ఆఫర్

రూ.400లకే ట్రిపుల్‌ప్లే ఫైబర్‌టీవీ బేసిక్‌ప్లాన్

అనంతపురం విద్య, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ సంస్థ వినియోగదారులకు సరికొత్త ఆఫర్ ప్రకటించింది. కేవలం రూ.400లకే సరికొత్త ట్రిపుల్ ప్లే (ఎఫ్‌టీటీహెచ్)ఫైబర్ టీవీ బేసిక్‌ప్లాన్ ప్రవేశపెట్టినట్లు అనంతపురం బిజినెస్ టెలికాం జనరల్ మేనేజరు షేక్‌ముజీబ్‌పాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈప్లాన్ ద్వారా అపరిమిత ఇంటర్నెట్, 44తెలుగు పేచానల్స్‌తోపాటు 9ఓటీటీలు కూడా పొందడానికి అవకాశం ఉందన్నారు. లోకల్ కేబుల్ ఆపరేటర్లు బీఎస్ఎన్ఎల్‌లో టిప్‌గా నమోదు చేసుకొని ఇప్పటికే ఉన్న ఏపీఎస్ఎఫ్ ఎల్ కస్టమర్లను బీఎస్ఎన్ఎల్‌కు మార్చడంతోపాటు కొత్త ఫైబర్ కనెక్షన్‌లను కూడా అందించవచ్చన్నారు. ఆసక్తిగల లోకల్‌కేబుల్ ఆపరేటర్లు అనంతపురం, ధర్మవరం, పుట్టపర్తి, హిందూపురం, కదిరి, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి పట్టణాలలో తమకు సమీపంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ డివిజనల్ కార్యాలయం లేదా జిల్లాకేంద్రంలో ఉన్న పీజీఎం కార్యాలయంలో సంప్రదించి ఈకొత్త ప్లాన్ పొందవచ్చన్నారు. శుక్రవారం నుంచే టిప్ మేళాలు నిర్వహిస్తామన్నారు.

ముచ్చటగా ముగ్గురే



శిక్షణకు హాజరైన జడ్పీటీసీ సభ్యులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం మహిళా ప్రజాప్రతినిధులను చైతన్యం చేసేందుకు నిర్వహిస్తున్న మార్పు ద్వారా విజేతలు కార్యక్రమానికి ఆఖరి రోజు ముగ్గురే హాజరయ్యారు. స్థానిక జడ్పీ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో మహిళా ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తొలి రోజు మంగళవారం ఇద్దరు, రెండో రోజు నలుగురు మాత్రమే హాజరయ్యారు. ఆఖరి రోజు గురువారం విడపనకల్లు ఎంపీపీ, కదిరి, గాండ్లపెంట జడ్పీటీసీ సభ్యులు హాజరయ్యారు. కొందరు జడ్పీ కార్యాలయ ఆవరణలోనే తిరుగుతున్నా.. శిక్షణకు మాత్రం హాజరు కాలేదు.

నానో ఎరువులతో మంచి ఫలితాలు

ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి



మాట్లాడుతున్న ఉమాదేవి

అనంతపురం అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పంటల్లో నానో ఎరువుల వాడకంతో మంచి ఫలితాలు వస్తాయని ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి సూచించారు. స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో కోరమాండల్ కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యాన అధికారులు, ఉద్యాన సహాయకులకు నానో యూరియా, డీఏపీ వాడకం ద్వారా కలిగే ఉపయోగాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సాధారణ యూరియా, డీఏపీ పంటలవారిగా ఏ మోతాదులో వాడుతారో అంతకంటే తక్కువ మోతాదులో నానో యూరియా, డీఏపీ వాడినా సరిపోతుందన్నారు. నానో ఎరువులు లిక్విడ్(ద్రవ) రూపంలో ఉండటంతో తగిన మోతాదులో పంటలకు పలు దశల్లో పిచికారీ చేసుకోవాలన్నారు. నానో ఎరువుల వాడకం సులభంగా ఉండటంతోపాటు రవాణా, ఇతర ఖర్చులు తగ్గుతాయ న్నారు. కార్యక్రమంలో ఉద్యాన ఏడీ దేవానంద్, కోరమాండల్ ప్రతినిధులు గోవిందరావు, మోహబూబ్ అలీ, స్వరూప్, నాయుడు, వెంకటేష్, శివకుమార్ పాల్గొన్నారు.

రైళ్ల రద్దు

గుంతకల్లు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ రైల్వేలోని ఖరగ్‌పూర్ రైల్వే డివిజన్ షాలిమార్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా రెండు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. షాలిమార్-వాస్కోడిగామా (వయా గుంతకల్లు) (18047) రైలును నవంబరు నెల 17న, దీని తిరుగు ప్రయాణపు రైలు (18048)ను నవంబరు 20న రద్దు చేసినట్లు తెలిపారు. ఈ రైలును అక్టోబరు 31, నవంబరు 13, 16, 18 తేదీల్లో సంత్రగాచి-షాలిమార్ సెక్షన్‌లో పాక్షికంగా రద్దుపరచనున్నట్లు తెలిపారు.

ధర్మవరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

ధర్మవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు పట్టుచీరల దుకాణాల్లో హ్యాండ్‌లూమ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం తనిఖీలు చేశారు. పట్టుచీరలను పరిశీలించారు. చేనేత రకాలపై హ్యాండ్‌లూమ్ మార్క్ వేసుకోవాలన్నారు. ప్యూర్ హ్యాండ్‌లూమ్ పట్టుచీరలు మాత్రమే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మంజునాథ్, జోనల్ టెక్స్‌టైల్స్ అధికారి భీమయ్య, తిరుపతికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్య, ఏడీఓలు సుబ్బానాయుడు, శీనానాయక్ పాల్గొన్నారు.



శిల్క్‌హౌస్‌లో పట్టుచీరలను పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఈ ప్రమోషన్ మాకొద్దు

జూనియర్ అసిస్టెంట్ల గగ్గోలు

మరో ఉద్యోగోన్నతి ఆలస్యమవుతుందనే..

గ్రేడ్-3 కార్యదర్శులుగా ప్రమోషన్లకు కౌన్సెలింగ్ ప్రారంభం



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీఓ నాగరాజనాయుడు



డీపీఓ నాగరాజనాయుడును సన్మానిస్తున్న ఉద్యోగోన్నతి పొందిన కార్యదర్శులు

అనంతపురం న్యూటౌన్ ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తమకు గ్రేడ్-3 కార్యదర్శిగా ప్రమోషన్ వద్దని పలువురు జూనియర్ అసిస్టెంట్లు గగ్గోలు పెడుతున్నారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శుల ప్రమోషన్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతో దాదాపు 8 సంవత్సరాలుగా ప్రమోషన్ కోసం ఎదురు చూసిన గ్రేడ్-4 కార్యదర్శులు(జాబితాలో పేరున్న వారు) ఆనందంలో మునిగిపోయారు. అయితే నిబంధనల ప్రకారం జూనియర్ అసిస్టెంట్స్ కోటా కింద కూడా అర్హులైన సిబ్బందికి గ్రేడ్-3 ప్రమోషన్ల జాబితాలో చోటు కల్పించారు. దీంతోనే అసలైన సమస్య ఏర్పడింది. జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందితే తర్వాత డిప్యూటీ ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి లభించే అవకాశం ఉంటుంది. అలా కాకుండా ప్రస్తుతం గ్రేడ్-3 ప్రమోషన్ తీసుకుంటే అక్కడి నుంచి గ్రేడ్-2, గ్రేడ్-1 కార్యదర్శులుగా ప్రమోషన్ పొందిన తర్వాతే డిప్యూటీ ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి పొందే అవకాశం వస్తుంది. ఈలోపు చాలా మంది ఉద్యోగ విరమణ పొందే పరిస్థితి ఉంటుంది. ఈనేపథ్యంలో జూనియర్ అసిస్టెంట్ ప్యానల్ నుంచి గ్రేడ్-3 ప్రమోషన్‌కు ఏ ఒక్కరు ఇష్టంగా లేరని కౌన్సెలింగ్ వద్ద గుసగుసలు వినిపించాయి.

జాబితా తయారీ సమయంలోనే..

గ్రేడ్-3 కార్యదర్శిగా ప్రమోషన్లకు సంబంధించి సీనియార్టీ జాబితా తయారు చేసే సమయంలోనే ఈ సమస్య తలెత్తింది. దీంతో ఆసక్తి లేని వారిని జాబితా నుంచి తొలగించి, గ్రేడ్-4 కార్యదర్శుల్లో అర్హత ఉన్నవారిని చేర్చి, కలెక్టర్ ఆమోదానికి జాబితా పంపినట్లు సమాచారం. దాన్ని కలెక్టర్ తిరస్కరించడంతో జూనియర్ అసిస్టెంట్లను కూడా చేర్చి మొత్తం 49 మందితో జాబితా తయారు చేసి కలెక్టర్ ఆమోదం పొందారు. ఈక్రమంలోనే గురువారం కౌన్సెలింగ్‌కు శ్రీకారం చుట్టారు. కాగా జూనియర్ అసిస్టెంట్లు గ్రేడ్-3 కార్యదర్శులుగా ప్రమోషన్లకు ఇష్టంగా లేరన్న సమాచారాన్ని కలెక్టర్‌కు వివరించడంలో డీపీ ఓ కార్యాలయ అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జూనియర్ అసిస్టెంట్లు మాత్రం గ్రేడ్-3 కార్యదర్శులుగా ప్రమోషన్ తీసుకొనే పరిస్థితులు లేవన్న చర్చ జరుగుతోంది.

డీపీఓ, ఏఓకు సన్మానం

'గత 20 ఏళ్లుగా ఉద్యోగం చేస్తున్నా ప్రమోషన్ రాకపోవడంతో ఇంక అది కలే అనుకున్నాం. కానీ ఇప్పుడు గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి లభిస్తుండటం సంతోషకరమని పలువురు గ్రేడ్-4 కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగోన్నతి ఉత్తర్వులు పొందిన తర్వాత డీపీఓ చాంబర్‌లో డీపీఓ నాగరాజనాయు డు, ఏఓ నాగరాజును శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

వడ్డీ వ్యాపారి అరెస్టు

జిల్లా నుంచి బహిష్కరిస్తాం

డీఎస్పీ హేమంత్ కుమార్



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ వేధింపుల కేసులో ప్రధాన నిందితుడు సాకే రాజశేఖర్ అలియాస్ ఎర్రగుంట రాజాను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ హేమంత్‌కుమార్ వెల్లడించారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన సాకే రాజశేఖర్ అలియాస్ ఎర్రగుంట రాజా వడ్డీవ్యాపారం చేస్తుంటాడు. వడ్డీ చెల్లించని వారిని తన గుంపుతో కలిసి బెదిరించడం, దాడులు చేయించడం, దౌర్జన్యంగా డబ్బు వసూలు చేయడం వంటి హింసాత్మక కార్యకలాపాలు పాల్పడుతుండేవాడు. ఈ క్రమంలో గతనెల 23న శాంతినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు రమణ, ఆయన భార్య భారతి ఇంటిపై ఎర్రగుంట రాజా.. తన అనుచరులతో దాడి చేసి బాధిత కుటుంబాన్ని తీవ్రంగా బెదిరించాడు. రూ.7వేలు వసూలు చేశాడు. అప్పట్లో బాధితురాలు భారతి ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ఇదివరకే ఆరుగురిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు ఎర్రగుంట్ల రాజా పరారీలో ఉండేవాడు. గురువారం పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆర్చ్ వద్ద ఉన్న అతడిని అరెస్టు చేసి, మొబైల్ ఫోన్, రూ.కోటి విలువ చేసే భూ సంబంధిత రిజిస్ట్రేషన్‌పత్రం, రూ.10లక్షల రెండు ప్రాంసరీ నోట్లు, రూ.2,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. పట్టణంలో అధిక వడ్డీవ్యాపారం, దాడులు, బెదిరింపులు, హింసాత్మక ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుని, రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. పీడీయాక్ట్‌తో పాటు జిల్లా బహిష్కరణ కూడా చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. కాగా, ఎర్రగుంట రాజాపై ఇప్పటికే పలు హత్య, వడ్డీ వ్యాపార దాడుల కేసులు నమోదయ్యాయనీ, రౌడీషీట్ కూడా ఉందన్నారు. ధర్మవరం, పెనుకొండ ప్రాంతాల్లో ఆరు కేసులు నమోదయ్యాయని డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ రెడ్డప్ప, సిబ్బంది రాజప్ప, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు



చంద్రాయుడు, కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త

అనంతపురం అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వరుస వర్షాల నేపథ్యంలో పంటలకు సోకిన పలు రకాల తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు పేర్కొన్నారు. పూత, కాయదశలోని వేరుశనగ పంటలో వేరుకుళ్లు, ఆకుమచ్చ తెగులు తోపాటు ఆకులను తినే లద్దె పురుగు ఆశించిందన్నారు. వీటి నివారణకు 400 మి.లీ, హెక్సాకొనజోల్, 200 మి.లీ, థయాక్లోప్రిడ్‌ను కలిపి ఎకరాలో పిచికారి చేసుకోవాలన్నారు. కంది పంటలో వేరుకుళ్లు, పోషక లోపాల నివారణ కోసం ఎకరాకు 300 గ్రాముల సాఫ్, ఎకరాకు కేజీ మల్టీకేను పిచికారీ చేసుకోవాలన్నారు. ఆముదంలో పాముచార, ఆకుతినే లద్దెపురుగు, ఎండు తెగులు నివారణ కోసం 300 గ్రాముల సాఫ్, ఎకరాకు 80 గ్రాముల ఎమామెక్టిన్ బెంజోయేట్‌ను పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు, ఆకు పొడ తెగులు, పోషక లోపాల నివారణ కోసం ఎకరాకు 400 మి.లీ, హెక్సాకొనజోల్, 80 గ్రాముల ఎమాహెక్టిన్ బెంజోయేట్‌ను పిచికారీ చేయాలన్నారు. పోషకాలలోపం నివారణ కోసం ఎకరాకు కేజీ మల్టికేగానీ, ఫార్ములా-4నుగానీ పిచికారీ చేయాలన్నారు. పత్తిలో పొగాకుగానీ, ఆకు తినే లద్దె పురుగులు, రసం పీల్చే పురుగుల నివారణ కోసం ఎకరాకు 400 మి.లీ, హెక్సాకొనజోల్, 200 మి.లీ, సైనిటెరామ్‌గానీ, 200 మి.లీ, సైరోటెట్రామేట్‌నుగానీ పిచికారీ చేసుకోవాలన్నారు. టమోటాలో కాయ మచ్చ తెగులు, వేరుకుళ్లు, పొడ తెగులు, కాయ తొలుచు పురుగు నివారణ కోసం ఎకరాకు 350 మి.లీ, కోనిక, 200 మి.లీ, నొవల్యూరాన్‌ను పిచికారీ చేసుకోవాలని సూచించారు.

మాజీ సైనికుల ఫిర్యాదుల పరిష్కార వేదిక

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక కొవ్వూర్‌నగర్‌లోని జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయంలో మాజీ సైనికులు, వీరనారుల సమస్యలపై గురువారం పరిష్కారవేదిక నిర్వహించారు. ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి తిమ్మప్ప, మద్రాస్ రెజిమెంటల్ ఆర్మీ అధికారులు సుబేదార్ దొడ్ల రమేష్, హవల్దార్లు అనీష్, ప్రతాప్‌రెడ్డి అర్జీలను స్వీకరించారు. నార్పలకు చెందిన ఆర్మీ జవాన్ వెంకటసుబ్బయ్య గతేడాది డిసెంబరులో జమ్మూకాశ్మీర్‌లోని దేశ సరిహద్దుల్లో సైనిక విధులు నిర్వహిస్తూ అమరుడయ్యారనీ, మద్రాస్ రెజిమెంట్, ఆర్ఆర్ రెజిమెంట్ల నుంచి క్యాజువాలిటీ క్లాసిఫికేషన్ రికార్డులు జిల్లాకు రాలేదని జవాన్ భార్య గాండ్ల లీలావతి అర్జీ అందజేశారు. రికార్డులను త్వరలో ఇక్కడికి చేరుస్తామని మద్రాస్ రెజిమెంటల్ అధికారులు బదులిచ్చారు. మొత్తం 20 అర్జీలు రాగా.. ఇందులో అన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి తిమ్మప్ప మాట్లాడుతూ.. మాజీ సైనికులు, వీరనారులకు పారా లీగల్ శంకర్, న్యాయవాది శశికళ ఉచిత న్యాయసేవలు అందిస్తారన్నారు. మాజీ సైనికులు, వితంతువుల సమస్యలకు సంబంధించిన పార్ట్-11 ఆర్డర్, పెన్షన్ ఇతర సమస్యలను విన్నవించుకుని పరిష్కరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సైనిక సంక్షేమశాఖ ఉద్యోగులు గిరీష్, బాబాఫకృద్దీన్, అమర్‌నాథ్ లాల్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఈనెల 23వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. గుంటూరు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు తుది రాత పరీక్షల్లో ఎంపికైన పురుష, మహిళ అభ్యర్థులకు ఈనెల 23న ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయం వద్ద చేపట్టే వెరిఫికేషన్‌కు అభ్యర్థులు దరకాస్తులతో జతపరిచిన అన్ని ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్, గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, 4 ఫొటోలు తెసుకురావాలని సూచించారు.

బి.పెడ్ ఫలితాలు విడుదల

అనంతపురం రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఆగస్టు నెలలో జరిగిన బి.పెడ్. నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. వీసీ అనిత, పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీరాములు నాయక్ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాలు శుక్రవారం నుంచి జన్మభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయని వారు తెలిపారు. మొత్తం 70మంది విద్యార్థులు పరీక్ష రాయగా 60మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. రీవాల్యూయేషన్ వ్యక్తిగత ధ్రువీకరణ కోసం దరఖాస్తు సమర్పించడానికి సెప్టెంబరు ఆరో తేదీని చివరి గడువుగా తెలిపారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

అనంతపురం క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ వ్యవసాయశాఖల అధికారులు గురువారం దాడులు చేశారు. రాయదుర్గం మండలంలోని మైలార లింగేశ్వర ట్రేడర్స్, శ్రీరామవేంద్ర ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు చేశారు. స్టాక్ నిల్వల రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించలేదని గుర్తించా రు. రూ.1.26 లక్షల విలువైన 4.20 మెట్రిక్కు టన్నుల ఎరువులు విక్రయించకూడదంటూ నోటీసులు జారీ చేశారు. తర్వాత బొమ్మనహాళ్ మండలంలోని దేవగిరి రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. యూరియా పంపిణీ గురించి విచారించి, స్టాక్ నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వాసుప్రకాష్, ఎస్ఐ గోపాలుడు, రాయదుర్గం ఏఎంఓ అహ్మద్‌బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మెకానిక్ దారుణహత్య



ధనుంజయ (ఫైల్)

ధర్మవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్‌పీ సర్కిల్‌లోని రైల్వే ఫ్లైఓవర్ కింద గురువారం తెల్లవారుజామున మెకానిక్ ధనుంజయ(26)ను తలపై సిమెంటు ఇటుకతో బాది దారుణంగా హత్య చేశా రు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన ధనుంజయ మెకానిక్. అతడికి భార్య శృతి, కుమారుడు నందవర్ధన్, కుమార్తె మధుశ్రీ ఉన్నారు. కొంతకాలం క్రితం ధనుంజయతో గొడవపడి భార్య పుట్టినిల్లు బళ్లారికి వెళ్లింది. ఈ నేపథ్యంలో ధనుంజయను గుర్తుతెలియనివారు దారుణంగా హత్య చేశారు. స్థానికుల సమాచారంతో సీఐ నాగేంద్రప్రసాద్.. ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ధనుంజయ తల్లి లక్ష్మీనారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.


అర్హులకు పింఛన్లు పునరుద్ధరిస్తాం

● డీఆర్‌డీఏ పీడీ శైలజ

అనంతపురం అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ పీడీ శైలజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనారోగ్యం, దివ్యాంగుల కేటగిరిల్లో పింఛన్లు తీసుకుంటున్నవారి అర్హతలను ఈ ఏడాది జనవరి నుంచి ప్రత్యేక వైద్య బృందాలతో రీ వెరిఫికేషన్ చేయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి దాకా నిర్వహించిన పునఃపరిశీలనలో కొందరు పింఛన్‌దారులకు వైకల్య శాతం, వ్యాధి తీవ్ర తగ్గడంతో వారి పింఛన్ కేటగిరీని మార్చినట్లు తెలిపారు. అలాగే 40 నుంచి 80 శాతం వైకల్యం ఉండి తీవ్రమైన అనారోగ్యం లేకపోయినా రూ.15వేలు పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారుల కేటగిరీని కూడా రూ.6వేల పింఛన్‌కు మార్చినట్లు తెలిపారు. 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉండటంతో పాటు 60 సంవత్సరాల వయస్సు కలిగిన వారిని వృద్ధాప్య పింఛన్ కేటగిరికి మార్చినట్లు వెల్లడించారు. 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉండి, 60 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన వారికి నోటీసులు జారీ చేసి, వారి పింఛన్ల రద్దుకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. వీరిలో అర్హులైన దివ్యాంగులుంటే స్థానిక ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లకు తగిన డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మానసిక వైకల్యం కలిగిన 18 సంవత్సరాలవయస్సులోపు పిల్లలకు యథాతథంగా పింఛన్ ఇస్తామని తెలిపారు. నోటీసులు అందుకున్న 30 రోజుల్లోపు నేరుగా ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయండి

● ముఖ్యమంత్రికి ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి వినతి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఒంటేరు శ్రీనివాసులురెడ్డి

అనంతపురం విద్య, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): టీచర్లకు ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుచేసి ప్రమోషన్లకు ఇబ్బంది లేకుండా చూడాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి ముఖ్యమంత్రిని కోరారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ఆయన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డితో కలిసి సీఎం చంద్రబాబును కలిశారు. కొన్ని సాంకేతిక కారణాలతో ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుకాక దశాబ్దాలుగా టీచర్లకు ప్రమోషన్లు అందకుండాపోతున్నాయన్నారు. ఇతరశాఖలలో రెండు, మూడు ప్రమోషన్లు తీసుకొని రిటైర్డ్ అవుతుంటే టీచర్లు మాత్రం ప్రమోషన్ లేకుండా రిటైర్డ్ అవుతున్నారని ముఖ్యమంత్రికి వివరించారు. ఏకీకృత సర్వీస్‌రూల్స్‌ను అమలు చేసి టీచర్లకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేసినటు ఒంటేరు తెలిపారు.

అమెరికా సంస్థతో ఎస్కేయూ ఎంఓయూ



ఒప్పంద పత్రాలు అందుకుంటున్న వీసీ అనిత తదితరులు

అనంతపురం రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): క్వాంటం టెక్నాలజీని ముందుకు తీసుకువెళ్లేందుకు అమెరికాకు చెందిన క్విన్సిసిస్ సంస్థతో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. సంస్థ ప్రతినిధి డా.వల్లూరి మహేశ్వరరావు, వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్ బాబు అవగాహన ఒప్పంద పత్రాలపై గురువారం యూనివర్సిటీలో సంతకాలు చేశారు. ఈసందర్భంగా వీసీ అనిత మాట్లాడుతూ ఈ భాగస్వామ్యంతో పరిశోధన, అభివృద్ధి, ఇంటర్న్‌షిప్‌లు, పారిశ్రామికత, ఆవిష్కరణ సహకారం, పరిశ్రమ-సంబంధిత పాఠ్యక్రమ అభివృద్ధి, సంయుక్త కార్యక్రమాలు వంటి విభాగాల్లో కలిసి పని చేస్తామన్నారు. అనంతరం ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్లో చర్చాగోష్ఠి నిర్వహించారు. కార్యక్రమంలో రెక్టార్ వెంకటనాయుడు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ అంజనేయులు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ శోభలత, ఈవెంట్ కన్వీనర్ ఆచార్య రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన కొత్త చైర్మన్లు



గడిపూటిని ఆలింగనం చేసుకున్న మంత్రి నారా లోకేశ్



మంత్రి లోకేశ్‌కు మొక్కను అందజేస్తున్న స్వప్న

అనంతపురం క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ చైర్మన్ పదవులు పొందిన జిల్లాకు చెందిన గడిపూటి నారాయణస్వామి, స్వప్న వేర్వేరుగా మంత్రి నారా లోకేశ్‌ను విజయవాడలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన గడిపూటి నారాయణస్వామిని మంత్రి లోకేశ్ ఆలింగనం చేసుకుని అభినందించారు. అదేవిధంగా వీర శైవ లింగాయత, లింగ బలిజ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ తుల్జాపూర్ స్వప్న కూడా మంత్రి లోకేశ్‌ను కలిసి తనకు పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

పచ్చబొట్లు..!

● జీబీసీ కింద జోరుగా వరి నాట్లు

నారు కట్టలతో నిండిన మడులు



విడపనకల్లు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు బ్రాంచ్ కాలువ (జీబీసీ)కింద వరి నాట్లు జోరందుకున్నాయి. గడేకల్లు, ఆర్ కొట్టాల, విడపనకల్లు, అంచనహాలు, డొనేకల్లు, కరకముక్కల, వేల్పుమడుగు, పాల్తూరు గ్రామాల్లో రైతులు వరి సాగు ప్రారంభించారు. రైతులు వివిధ ప్రాంతాల నుంచి వరి నారును కొనుగోలు చేసుకుని విడపనకల్లు మండలానికి తెచ్చుకుంటున్నారు. కొంత మంది ఎద్దులతోను, మరి కొంత మంది రైతులు ట్రాక్టర్లుతోను పాక మడక సేద్యం చేస్తున్నారు. మహిళలు జానపదగేయాలు ఆలపిస్తూ వరి నాట్లు వేస్తున్నారు. దీంతో పొలాలన్నీ లేత ఆకు పచ్చగా మారుతున్నాయి.




వరి నాట్లు వేస్తున్న మహిళలు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

డాక్టర్ వి. రాఘవన్ (జయంతి)



సంస్కృత భాషా పండితులు, సంగీత కర్త 'పద్మభూషణ్' గ్రహీత వెంకటరామన్ రాఘవన్ 1908 ఆగస్టు 22న తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లా తిరువారూరులో జన్మించారు. సంగీతం, సంస్కృతంలో సౌందర్యశాస్త్రం తదితరాలపై 120కుపైగా పుస్తకాలు, 1200కుపైగా రచనలు చేశారు. అలంకార, నాట్యశాస్త్రాలలో డాక్టరేట్ పొందారు. 'శ్రీరంగ ప్రకాశ్' ను సంస్కృతంలోకి అనువాదం చేసి సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. మద్రాస్ మ్యూజిక్ అకాడమీకి 1944 నుంచి తుదిశ్వాస వరకు కార్యదర్శిగా పనిచేశారు. గురువు చంద్రశేఖరానంద సరస్వతిపై 'చంద్రశేఖరం ఆశ్రయే' పాటను రాశారు. 1979 ఏప్రిల్ 5న కన్నుమూశారు.

పీవీఆర్‌కే ప్రసాద్ (జయంతి)




టీటీడీ ఈఓగా చిరపరిచితులైన పీవీఆర్‌కే ప్రసాద్ 1941 ఆగస్టు 22న నెల్లూరు జిల్లా గూడూరులో జన్మించారు. 1966 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన సబ్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా ఉత్తమ సేవలందించి ప్రజాదరణ పొందారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు మీడియా సలహాదారుగా వ్యవహరించారు. విశాఖపట్నం పోర్టు ట్రస్టు చైర్మన్‌గాను, ఇతర కీలక హోదాలలో కొనసాగారు. ప్రధానంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పాలనాపరమైన సంస్కరణలు తెచ్చి భక్తుల సేవలకు ప్రాధాన్యత ఇచ్చారు. రిటైరయ్యాక కూడా టీటీడీ సలహాదారుగా వ్యవహరించారు. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టుకు చైర్మన్‌గా వ్యవహరించారు. తన అనుభవాలతో ఎన్నో పుస్తకాలు రాశారు. రాష్ట్ర రత్న, శ్రీకృష్ణ అనుగ్రహ, రాజర్షి వంటి గౌరవాలు అందుకున్నారు. 2017 ఆగస్టు 21న కన్నుమూశారు.

డాక్టర్ యూఆర్ అనంతమూర్తి (వర్ధంతి)



కన్నడ సాహితీవేత్త ఉడుపి రాజగోపాలాచార్య (యూఆర్) అనంతమూర్తి 1932 డిసెంబరు 21న శివమొగ్గ జిల్లా తీర్థహళ్ళి తాలూకా మేళిగె గ్రామంలో జన్మించారు. 'పద్మభూషణ్' గ్రహీత. కాలానికి అనుగుణమైన రచనలు చేశారు. సాహిత్యంలో అత్యున్నతమైన జ్ఞానపీఠ పురస్కారం, కేంద్రంచే పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. కొన్ని నవలలు, చిన్నకథలు సినిమాలుగా రూపొందించబడ్డాయి. మైసూరు యూనివర్సిటీలో ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. కొట్టాయంలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీకి వైస్‌చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. బెంగళూరు సహా పది నగరాలకు ఆయన సూచించిన పేర్లను రాష్ట్రప్రభుత్వం ఆమోదించింది. 2014 ఆగస్టు 22న కన్నుమూశారు.

చిరంజీవి (పుట్టినరోజు)



తెలుగు సినీ రంగంలో మెగాస్టార్‌గా పేరొందిన 'పద్మభూషణ్' గ్రహీత చిరంజీవి 1955 ఆగస్టు 22న పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో జన్మించారు. అసలు పేరు కొణిదెల శివశంకర వరప్రసాద్. తెలుగు సినీరంగంలోనే కాక జాతీయస్థాయిలోనూ పేరొందారు. కెరీర్‌లో 150కు పైగా సినిమాలలో నటించారు. దక్షిణాది నుంచి తొలిసారిగా 1987లో ఆస్కార్ ప్రదానోత్సవానికి ఆహ్వానించబడ్డారు. 'రుద్రవీణ'కు జాతీయ పురస్కారం దక్కింది. 4 నంది అవార్డులు, 10 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, ఇతర గౌరవాలు అందుకున్నారు. ఐపీఎల్ క్లబ్ కేరళ బ్లాస్టర్స్ ఎఫ్‌సీకి సహభాగస్వామ్యం కలిగారు. ట్రస్టు ద్వారా ఐబ్యాంక్, బ్లడ్‌బ్యాంకులతో సమాజసేవ అందిస్తున్నారు. కేంద్రమంత్రిగా వ్యవహరించారు. 2022లో ఐఎఫ్ఎఫ్ఐ ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నారు. ఆంధ్ర యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు.

వసంతలక్ష్మి నరసింహాచారి (పుట్టినరోజు)



వసంతలక్ష్మి 1954 ఆగస్టు 22న ప్రకాశం జిల్లా కనిగిరిలో జన్మించారు. భరతనాట్యం, కూచిపూడిలలో కొరియోగ్రాఫర్‌గా రాణించారు. భర్త నరసింహాచారితో కలసి 1969లో కళా సమర్పణ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యటించి సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రసంగాలతో దేశ ఔన్నత్యాన్ని ఇనుమడింపచేశారు. నట్టువాంగంలోనూ సత్తా చాటుకోగా వీణా వాదకురాలిగాను రాణించారు. సంగీత నాటక అకాడమీ అవార్డు, లెజెండరీ ఉమెన్ అవార్డు, నృత్య కళానిధి ఇతర పురస్కారాలు అందుకున్నారు.

కృష్ణా నదికి వరద ఉధృతి



నీట మునిగిన కొప్పర లక్ష్మి నరసింహ స్వామి ఆలయం

రాయచూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణానదికి వరద ప్రవాహం ఉధృత రూపమైంది. నారాయణపూర్ జలాశయం నుంచి పెద్ద ఎత్తున 2.65 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తుండడంతో గురువారం జిల్లాలో ఒక్కసారిగా కృష్ణానది ఉగ్రరూపం దాల్చింది. దేవదుర్గ తాలూకాలోని హూవినహడగి గ్రామ సమీపంలో కృష్ణా నది పై నిర్మించిన వంతెన పూర్తిగా నీట మునిగిపోగా ఈ మార్గంలో ప్రయాణాలు నిలిచిపోయాయి. ఈ మార్గం గుండా దేవదుర్గ నుంచి యాదగిరి, సురపుర, కలబుర్గి తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులను తింథిణి బ్రిడ్జి మీదుగా దారి మళ్లించారు. తాలూకాలో పురాతన దేవాలయాలుగా నది తీర గ్రామంలో వెలసిన కొప్పర లక్ష్మి నరసింహ స్వామి, గూగల్ ప్రభులింగేశ్వర స్వామి, బెణ్ణెకల్‌లోని అణ్ణమల్లేశ్వర స్వామి, హూవినహడగి వద్దగల గడ్డెగూడ బసవేశ్వర ఆలయాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. ఈ ఆలయాల్లో నిత్య పూజలు నిలిచిపోయాయి. కాగా నది తీర గ్రామాలకు జలచరల బెడద పెరిగిపోయింది. మొసళ్లు పలు విష సర్పాలు నీటిలలో నుంచి వచ్చి గ్రామాలవైపు వస్తుండగా ప్రజలు ఆందోళనకు గరవుతున్నారు. కాగా తహసీల్దార్ తాలూకా పంచాయతీ అధికారి తీర గ్రామాల వద్దే బస ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

ఘనంగా శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

ధర్మవరం రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల పరిధిలోని తుంపర్తి గ్రామంలో శ్రీకృష్ణుడి ఊరేగింపును ఘ నం గా నిర్వహించారు. ఈ నెల 16న కృష్ణా ష్టమి నుంచి పూజలందుకున్న శ్రీకృష్ణుడి ప్రతిమను గురువారం అలంకరించి గ్రామంలో ఊరేగించారు. స్థానికులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి సేవా సమితి సభ్యులు తరలివచ్చి గ్రామోత్సవంలో భజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఇందూ జ్ఞాన వేదిక తుంపర్తి కమిటీ అధ్యక్షుడు అప్పిరెడ్డి, సభ్యులు శివారెడ్డి, ప్రతాప్, యోగా నందరెడ్డి, అశోక్ రెడ్డి, ఆదినారాయణరెడ్డి, గోవిందు, రామ్మోహన్‌రెడ్డి, కాంతమ్మ, శ్రీలత, వరలక్ష్మి, లక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.

నోటీసు లేకుండా తొలగిస్తారా..?

● గార్మెంట్ పరిశ్రమ ముందు కార్మికుల నిరసన

బాగేపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని టోల్‌ప్లాజా సమీపానగల చౌదరి గార్మెంట్స్‌లో 130మంది పురుష, మహిళా కార్మికులను ఎలాంటి నోటీసులేకుండా తొలగించడంపై కార్మికులు గురువారం భారీ నిరసన చేపట్టారు. ఇక్కడి గార్మెంట్స్‌లో బాగేపల్లి పట్టణంతోపాటు ఘంటంవారిపల్లి గ్రామపంచాయతీ పుట్టపర్తి, కొండరెడ్డిపల్లి, ఆదిగానహళ్ళి, ఘంటంవారిపల్లి సహా పలు గ్రామాలకు చెందిన వారు ఉన్నారు. సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోడూరు, కొడికొండ చెక్‌పోస్ట్, చిలమత్తూరు, లేపాక్షి, సోమందేపల్లి తదితర గ్రామాలకు చెందిన వందలాదిమంది ఇక్కడ పనిచేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న 130మంది కార్మికులను బుధవారం సాయంత్రం తొలగిస్తున్నట్టు గార్మెంట్స్ మేనేజర్ మహేందర్ ప్రకటించారు. దీంతో గురువారం ఉదయం కార్మికులంతా చేరి తమ నిరసన తెలిపారు. ఎలాంటి కారణం లేకుండా అకస్మికంగా తొలగిస్తున్నట్లు ప్రకటించారని, ముందస్తు నోటీసు కూడా ఇవ్వలేదని పలువురు కార్మికులు విచారం వ్యక్తం చేశారు. సీఐటీయూ కార్మికనేత డీటీ మునిస్వామి, కే మునియప్ప, అశ్వత్థప్ప, జీ కృష్ణప్ప, దళిత సంఘాల ప్రముఖులు కే వెంకటేశ్‌లు నిరసనకు నేతృత్వం వహించారు. ఘటనా స్థలానికి సబ్‌ఇన్‌స్పెక్టర్ నాగమ్మ, సహాయక సబ్ ఇన్‌స్పెక్టర్ హనుమంతరాయప్ప, గార్మెంట్స్ మేనేజర్ మహేందర్‌లు చేరుకున్నారు. తొలగించిన వారిని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని, జీతాలు, పీఎఫ్ వంటివి సకాలంలో విడుదల చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. మహేందర్ స్పందిస్తూ అమెరికా మనదేశ దుస్తులపై అధిక సుంకాలు విధించిందని, ఇది నష్టాలకు కారణమవుతోందన్నారు. కార్మికులకు ఎక్కువ వేతనాలు ఇచ్చే పరిస్థితుల్లో లేకపోవడంతోనే తొలగించాల్సి వస్తోందన్నారు. మళ్లీ చేర్చుకోవడం అనేది మేనేజ్‌మెంట్ పరిశీలిస్తుందని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

తగ్గిన కంది సాగు విస్తీర్ణం

వర్షాభావ పరిస్థితులే కారణం

మండలవ్యాప్తంగా కేవలం 14 ఎకరాల్లోనే సాగు



వేరుశనగలో అంతర పంటగా సాగైన కంది (ఫైల్)

చిలమత్తూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కందిసాగు విస్తీర్ణం భారీగా తగ్గింది. ఈ ఖరీఫ్‌లో కంది పంటపై రైతులు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. గత ఏడాది ఎంతో లాభదాయకంగా ఉన్న కంది పంట ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు తగ్గింది. ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాలు లేకపోవడంతో వేరుశనగ, కంది పంటల సాగు పూర్తిగా తగ్గినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా వేరుశనగతో పాటు కంది పంట ఇటీవల రైతులు సాగు విస్తీర్ణాన్ని పెంచుకుంటూ వస్తున్నారు. ఈ తరుణంలో వర్షాలు లేకపోవడంతో ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా కేవలం 14 ఎకరాల్లో మాత్రమే సాగయ్యింది. గత ఏడాది ఖరీఫ్‌లో 300 ఎకరాల వరకు సాగైంది. ప్రస్తుతం కంది పప్పు ధర మార్కెట్‌లో కిలో రూ. 185 నుంచి రూ. 165, రూ. 140 వరకు పలుకుతోంది. ఏ మాత్రం నాణ్యత లేని కందిపప్పు కిలో కనిష్ఠంగా రూ. 95గా ఉంది. అయితే ఈ ఖరీఫ్‌లో కంది పంట సాగు తగ్గుముఖం పట్టింది. గత పదిరోజులుగా వర్షాలు పడుతున్నా ఇప్పుడు కంది విత్తుకుంటే పెద్దగా పంట దిగుబడులు రావని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రైతులు కూడా కందిపంట సాగుపై పెద్దగా ఆశక్తి చూపడంలేదు.

గణేశ్ ఉత్సవాల్లో అలరించనున్న సంగీత ప్రదర్శన



మీడియాతో మాట్లాడుతున్న ట్రస్టీ సభ్యులు

బెంగళూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బెంగళూరు గణేష్ ఉత్సవ్ అంటే కేవలం పండుగ కాదని ఇదే కొత్త అనుభవమని ఉత్సవ సమితి ట్రస్టీ నందీష్ ప్రకటించారు. ఈనెల 27 నుంచి సెప్టెంబరు 6వ తేదీ వరకూ 11 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని ప్రకటించారు. భక్తి సంగీతం, కళల ప్రదర్శనలతో పాటు ఆహారం, సంస్కృతిగా ఊరేగింపు ఉంటుందన్నారు. ప్రముఖ గాయని ఎండీ పల్లవి, ఇందు నాగరాజ్, సూర్యగాయిత్రి, తెలుగు ప్రముఖ నేపథ్య గాయని సునీతా ఉపద్రష్ట, పండిత్ వెంకటేష్ కుమార్, వినయ్ వారణాసి, బాల కళాకారుడు గంగా శశిధరన్‌లు కళాకారుల కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతి రోజు భక్తిసంగీతంతో పాటు బెంగళూరు యువత ఆసక్తి చూపే ఆధునిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. క్రేజీస్టార్ రవి చంద్రన్, మయూర్ రాఘవేంద్రలు ప్రత్యేకంగా పాల్గొంటారన్నారు. ప్రముఖ గాయకులు విజయ్ ప్రకాష్, రఘుదీక్షిత్, ఎండీ పల్లవితో పాటు భక్తిసంగీత ప్రముఖ గాయకులు యేసుదాస్ కుమారుడు విజయ్ యేసుదాస్ కచేరి ఉంటుందన్నారు. ఎపీఎస్ కళాశాల మైదానంతో పాటు నేషనల్ కళాశాల మైదానంలో కార్యక్రమాలు జరుపుతున్నట్లు ప్రకటించారు.

ఎరువు.. పట్టించుకునేవారు కరువు..!

సరఫరాపై కొరవడిన పర్యవేక్షణ

శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ యంత్రాంగం ఇష్టారాజ్యం

ఆరు నెలల క్రితం ర్యాక్ ఆఫీసర్ల నియామకం

అటువైపు కన్నెత్తిచూడని అధికారులు

ఎరువులు కేటాయింపులపైనా సందేహాలు

కర్ణాటకకు యూరియా తరలిస్తున్నారన్న ఆరోపణలు

అనంతపురం అర్బన్/పుట్టపర్తి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలో ఎరువుల సరఫరాపై పర్యవేక్షణ కొరవడింది. ఉమ్మడి జిల్లాకు ఈ ఏడాది జనవరి దాకా అనంతపురం వ్యవసాయ అధికారులే రేకు ఆఫీసర్‌గా వ్యవహరించేవారు. ఫిబ్రవరి నుంచి శ్రీసత్యసాయి జిల్లాకు ప్రత్యేకంగా ఒక ఏడీఏను ర్యాక్ ఆఫీసర్‌గా, ఏఓను అసిస్టెంట్ రేకు ఆఫీసర్‌గా నియమించారు. ఇద్దరు అధికారులను నియమించినా.. వారు పట్టనట్లు వ్యహరిస్తున్నట్లు సమాచారం. శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేసే ఓ అధికారి అంతా తానై ఎరువుల కేటాయింపుల వ్యవహారాన్ని నడిపిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

పర్యవేక్షణ గాలికి..!

శ్రీసత్యసాయి జిల్లాలో ఎరువుల సరఫరాపై వ్యవసాయ, ఏపీ మార్క్‌ఫెడ్ అధికారులు కనెత్తి చూడటం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అనంత జిల్లాకులోని హోల్ సేల్, ఏపీ మార్క్‌ఫెడ్, రిటైల్ డీలర్లకు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కేటాయింపు ఉత్తర్వుల మేరకు ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద నుంచి రైలు వ్యాగిన్‌ల ద్వారా వచ్చిన ఎరువులను సరఫరా చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో అందుకు విరుద్ధంగా వ్యవహారం జరుగుతున్నట్లు సమాచారం. జిల్లాలో పనిచేసే ఓ అధికారి అంతా తానై ఎరువుల కేటాయింపులు చేస్తూ చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ వర్గాలు ఎరువుల కేటాయింపు వివరాలు బయటకు రాకుండా తొక్కిపెడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ ఏడాది జనవరి వరకు ఉమ్మడి జిల్లా ఎరువుల రేకు పర్యవేక్షణ బాధ్యతలు అనంత ఏడీఏ నిర్వర్తించేవారు. 'యూరియా' దోపిడీ శీర్షికన ఈ ఏడాది ఫిబ్రవరిలో శ్రీసత్యసాయి జిల్లాలో దోపిడీ తీరుపై 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పందించిన ఆ జిల్లా యంత్రాంగం ధర్మవరం ఏడీఏని ర్యాక్ ఆఫీసర్‌గా, ఏఓను అసిస్టెంట్ ర్యాక్ ఆఫీసర్‌గా నియమించింది. శ్రీసత్యసాయి జిల్లాకు కేటాయింపుల మేరకు... వ్యాగిన్‌లో ఎరువుల ర్యాక్‌లు వచ్చిన సమయంలో సంబంధిత రేకు ఆఫీసర్ ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ వద్ద నుంచి ఎరువుల సరఫరాను పర్యవేక్షించాల్సి ఉంది. అప్పటి నుంచి వ్యాగిన్‌లో ఎరువుల ర్యాక్ వచ్చిన సమయంలో ఏ ఒక్క రోజు ర్యాక్ ఆఫీసర్ హాజరుకాలేదని సమాచారం. శ్రీసత్యసాయి జిల్లా ఏపీ మార్క్‌ఫెడ్ అధికారులు ఎరువుల సరఫరాపై పర్యవేక్షించిన దాఖలాలు లేవన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఎరువులు ఎక్కడికి వెళ్తున్నాయి

శ్రీసత్యసాయి జిల్లాకి సరఫరా చేసిన ఎరువులు ఎక్కడికి వెళ్తున్నాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఓ హోల్ సేల్ డీలర్‌కు అత్యధికంగా యూరియా, డీఏపీ, ఇతర రకాల ఎరువులు కేటాయిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సొసైటీలు, ఆర్ఎస్‌కేలు, రిటైల్ డీలర్లకు తక్కువగా ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో యూరియాకు డిమాండ్ పెరిగింది. యూరియా బస్తా (45 కేజీలు) ఎమ్మార్పీ రూ.267. శ్రీసత్యసాయి జిల్లాకు కేటాయించిన యూరియాను కర్ణాటకకు తరలించి జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూరియా బస్తా రూ.500కి కర్ణాటక హోల్ సేల్ డీలర్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఈ కారణంతోనే శ్రీసత్యసాయి జిల్లాలో యూరియా కొరత ఎక్కువైనట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో యూరియా కొరతతో రైతులు ఇక్కట్లకు గురవుతున్నారు. బస్తా యూరియా రూ.380 నుంచి రూ.400కి విక్రయిస్తున్నట్లు సమాచారం. అధిక ధరలకు పలు ప్రాంతాల్లో యూరియా విక్రయాలు జరుపుతుండటంతో రైతులపై అదనపు భారం పడుతోంది. శ్రీ సత్యసాయి జిల్లాలో యూరియా కొరత కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నా.. పలు ప్రాంతాల్లో ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నా.. వ్యవసాయ ఉన్నతాధికారులు స్పందించకపోవడంలో అంతర్యమేమిటో అర్థం కావడంలేదు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప... సమస్య కొలిక్కి వచ్చే పరిస్థితి లేదన్న వాదనలున్నాయి.



ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద లోడ్ చేస్తున్న ఎరువులు



అంధ విద్యార్థులతో కాంగ్రెస్ నాయకులు ఆంజినప్ప

అంధ విద్యార్థులకు దుస్తుల పంపిణీ

శిడ్లఘట్ట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రానున్న వినాయకచవితి నేపథ్యంలో పట్టణంలోని ఆశాకిరణ పాఠశాలలో అంధ విద్యార్థులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుడు, సమాజసేవకుడు పుట్టు ఆంజినప్ప పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు గురువారం సామాజిక సేవలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేయడంతోపాటు భోజనం సమకూర్చారు. కాంగ్రెస్ నాయకుడు గౌడనహళ్ళి మంజునాథ్ మాట్లాడుతూ పుట్టు ఆంజినప్ప ఎన్నో ఏళ్లుగా సమాజసేవలో కొనసాగుతున్నారని, ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తలకాయలబెట్ట అశ్వత్థరెడ్డి, నగరసభ మాజీ సభ్యుడు మయూర రాజకుమార్, వై హుణసేనహళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్షుడు మురళి, సాదిక్, హిత్తలహళ్ళి సురేశ్ పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం ప్రారంభం



నూతన కార్యాలయం ముందు అధికారులు, సిబ్బంది

దొడ్డబళ్ళాపుర, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన దొడ్డబళ్ళాపురలో రాష్ట్ర కాలుష్యనియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటైంది. కార్యాలయాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. టీబీ సర్కిల్‌లోని ప్రజాపనులశాఖ భవనంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. సీనియర్ పర్యావరణ అధికారి అనిల్‌కుమార్, భాస్కర్, విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల మూసివేతపై విద్యార్థుల ఆగ్రహం

బెంగళూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను ఎట్టి పరిస్థితిలోను మూసివేయరాదని ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో గురువారం ఫ్రీడం పార్కులో నిరసన తెలిపారు. నిరసనలో పలువురు విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం 6,200 పాఠశాలలను విలీనం, మూసివేసేందుకు సిద్ధం కావడం సరికాదన్నారు. ఇప్పటికే పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల వైపు ఆసక్తి చూపుతున్నారన్నారు. పాఠశాలలను మూసివేయరాదంటూ 50లక్షల మందితో సంతకాలు సేకరించి ముఖ్యమంత్రికి పంపుతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడ్తామని హెచ్చరించారు.

ఫేస్ యాప్ నిబంధన ఎత్తివేయాలి

● ఆశా వర్కర్ల డిమాండ్



నిరసనలో ఆశా కార్యకర్తలు

రాయచూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు ఫేస్ యాప్ ఆధారంగా ఆహార పదార్థాల అందించాలన్న నిబంధనను వెంటనే రద్దు చేయాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఈ కొత్త నిబంధనల వల్ల లబ్ధిదారుల హక్కులను హరించడంతో పాటు వారికి అన్యాయం జరగనుందన్నారు. ఇందుకు నిరసనగా సీఐటీయూ అనుబంధ సంయుక్త కర్ణాటక ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక టిప్పుసుల్తాన్ గార్డన్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లడిన నాయకులు, ఎలాంటి నిబంధనలు వర్తింప చేయకుండా బాధితులకు పోషక ఆహార అందించే బాధ్యత ఐసీడీఎస్ తీసుకోవడంతో సుప్రీం కోర్టు తీయించిన తీర్పును కేంద్ర ప్రభుత్వం విస్మరించడం సరికాదన్నారు. వెంటనే తన నిర్ణయాన్ని ఉప సంహరించుకుని ఐసీడీఎస్ బలోపేతానికి చర్యలు చేపట్టాలన్నారు. కాగా గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా ఆశా వర్కర్లను సీడీ గ్రేడ్ ఉద్యోగులుగా గుర్తించాలని 2018 నుంచి కనీస వేతనం అమలు చేయాలని కోరారు.

ద్విచక్రవాహనం ఢీకొని మృతి

పరిగి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మోదా గేటు సమీపంలోని అమరావతి లేఅవుట్ వద్ద బుధవారం రాత్రి ద్విచక్రవాహనం ఢీకొని మోసాపత్ర(45) మృతి చెందినట్లు ఏఎస్ఐ బాలరాజు తెలిపారు. ఒరిస్సా రాష్ట్రానికి మోసాపత్ర ఒక పరిశ్రమలు కూలి పనిచేసేవాడు. బుధవారం రాత్రి మోసాపత్ర, అతడి స్నేహితుడు అశోక్‌కుమార్ మోదాగేటులో కూరగాయలు కొనుగోలుచేసి వెళ్తుండగా కర్ణాటక రాష్ట్రం మిద్దెపల్లి నుంచి ద్విచక్రవాహనదారుడు జావిద్ వెనుక నుంచి మోసాప్రత్‌ను ఢీకొన్నాడు. దీంతో తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో హిందూపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు.

ఉరివేసుకుని ఆత్మహత్య

అమరాపురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఉడికి కిష్టప్ప(59) గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ రామాంజినేయులు తెలిపారు. మం డల పరిధిలోని నాగోనపల్లి గ్రామానికి చెందిన ఉడికి కిష్టప్ప 15ఏళ్లుగా వెన్నెముక నొప్పితో బాధపడుతుండేవాడు. అనేక ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకున్నా ప్రయోజనం లేకపోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.42	1,625.70
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,29, 439	30,893
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,30, 038	8,658
నీటి నిల్వ (టీఎంసీలు)	74.61	78.80



బియ్యం బస్తాలను లోడ్ చేస్తున్న హమాలీలు

అస్సాంకు బియ్యం రవాణా

కంప్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అస్సాం రాష్ట్రానికి కారటగి, సిరుగుప్ప, గంగావతి పట్టణాల నుంచి సోనామసూరి బియ్యం తరలిస్తున్నారు. గురువారం రెండు వేల టన్నుల బియ్యం రవాణాకు సిద్ధం చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా మన ప్రాంతంలోని సోనా మసూరి బియ్యానికి డిమాండ్ బాగా పెరిగింది. ఈ యేడాది కలకత్తా, హిమాచల్ ప్రదేశ్, అస్సాం, ఒరిస్సా రాష్ట్రాల నుంచి కూడా మన బియ్యానికి ఆర్డర్లో వచ్చినట్లు వ్యాపారస్తులు తెలిపారు. ఎగుమతితో జిల్లా రైతులకు మంచి ధర పలుకుతున్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మట్టి వినాయకుల వినియోగంపై నేడు ర్యాలీ

పెనుకొండ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మట్టి వినాయకుల వినియోగంపై కలిగే ఉపయోగాల గురించి ప్రజలకు, విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో స్థానిక షిర్డీసాయి గ్లోబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఛైర్‌పర్సన్ శిల్ప తెలిపారు. శుక్రవారం ఉదయం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో స్థానిక జూనియర్ కళాశాల నుంచి ర్యాలీ ప్రారంభమై పట్టణంలో ప్రధాన కూడళ్ల ద్వారా గ్లోబుల్‌ట్రస్ట్ కార్యాలయానికి చేరుకుంటుందన్నారు. అనంతరం మట్టి వినాయకులు వినియోగంపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. అక్కడే విద్యార్థులకు భోజన వసతి కల్పించడం జరిగిందన్నారు.

పీజీలో ప్రవేశానికి

దరఖాస్తుల ఆహ్వానం

హోస్పేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మైసూర్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న చామరాజేంద్ర ప్రభుత్వ విజువల్ ఆర్ట్స్ కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 2025-26 విద్యాసంవత్సరానికి విజువల్ ఆర్ట్స్‌లో మొదటి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ మాస్టర్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్ (ఎంవీఏ)లో ప్రవేశానికి ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల డీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీవీఏ బ్యాచిలర్ ఉత్తీర్ణులకు..

బీవీఏ బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని మైసూర్ చామరాజేంద్ర ప్రభుత్వ విజువల్ ఆర్ట్స్ కళాశాల డిన్ తెలిపారు. ఆస్తక్తి ఉన్న విద్యార్థులు మైసూర్ చామరాజేంద్ర ప్రభుత్వ విజువల్ ఆర్ట్స్ కళాశాల కార్యాలయం నుంచి అడ్మిషన్ దరఖాస్తు ఫారమ్‌ను పొంది ఆగస్టు30లో సమర్పించాలన్నారు. అర్హత పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూ తేదీని దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు తెలియజేస్తారు. ఎంవీఏ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ అనేది పెయింటింగ్, గ్రాఫిక్స్, శిల్పవిభాగాలలో ప్రత్యేక అధ్యయన డిగ్రీ కలిగి ఉండాలి. మరిన్ని వివరాలకు సెల్:08212438931 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

బాలల హక్కులను కాపాడండి

● రాష్ట్రంలో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలి : జిల్లా సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనే

బళ్లారి సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల కేసుల సంఖ్యను సున్నాకి తీసుకురావడానికి అన్ని శాఖల అధికారులు కలిసి పనిచేయాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి సివిల్ జడ్జీ రాజేశ్ హొసమనె అన్నారు. బెంగళూరులోని బాలల రక్షణ డైరెక్టరేట్, జిల్లాపరిపాల. జిల్లాపంచాయతీ, జిల్లా న్యాయసేవల అథారిటీ , మహిళా శిశు అభివృద్ధి శాఖ, పాఠశాల విద్యా శాఖ, జిల్లాబాలల రక్షణ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని తాలూకా పంచాయతీ హాల్లో ప్రభుత్వ ,ప్రభుత్వేతర ప్రీ-యూనివర్శిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ కోసం బాల్య వివాహ నేషేద చట్టం , పోక్సో చట్ట అమలుపై నిర్వహించిన ఒక రోజు శిక్షణకార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాల్యవివాహ నిషేధ అధికారులుగా నియమితులైన కళాశాలల ప్రిన్సిపాల్‌లు తమ పరిధిలోని విభాగాలతో చురుగ్గా పాల్గొని బాల్యవివాహాలను నివారించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.దీని ద్వారా వారు పిల్లలు హక్కులను కాపాడి సామాజిక న్యాయం కోసం ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంలో బాల్యవివాహాలు అధికంగా జరుగుతున్నాయని, బాల్యవివాహలు,పోక్సో చట్టం, మాదకద్రవ్యాల గురించి కళాశాల విద్యార్థులకు నిరంతరం అవగాహన కల్పించాలన్నారు. జిల్లాబాలల సంరక్షణ అధికారి నాగప్ప మాట్లాడుతూ బాల్యవివాహం , పోక్సోచట్టంగురించి అవగాహన కల్పించాల్సిన అవసరం గురించి అలాగే వివిధ రకాల బాదల్లో ఉన్న పిల్లల రక్షణ, దత్తత ప్రక్రియ , జిల్లా



మాట్లాడుతున్న సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బాలల రక్షణ యూనిట్ సేవలపై ఉపన్యసించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ కులకర్ణి మాట్లాడుతూ పిల్లలపై వేధింపులను నివారించడంలో ప్రిన్సిపాల్స్ పాత్ర ఉందని ,పిల్లలపై వేధింపులు కేసులు వస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 పోలీస్ ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ 112కు కాల్ చేయాలని కోరారు. ఈసందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ సభ్యుడు రాఘవేంద్ర, కార్పోరేషన్ ఈఓ డాక్టర్ శ్రీధర్,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు మంజునాథ్, నందిని షిండే, చన్నబస్ప, రవి,సుధ, నిలోఫియా, 60మందికి పైగా కళాశాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై యువతకు అవగాహన కల్పించాలి

● జిల్లా సర్జన్ డాక్టర్ బసారెడ్డి



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లాసర్జన్ బసారెడ్డి

బళ్లారి సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ వ్యాధికి జీవితాంతం చికిత్స అవసరమని, యువ తరానికి హెచ్‌ఐవీ వ్యాధి పట్ల అవగాహన కల్పించాలని జిల్లాసర్జన్ డాక్టర్ బసారెడ్డి అన్నారు. బెంగళూరులోని రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంఘం ,జిల్లా పరిపాలన, జిల్లాపంచాయతీ జిల్లా ఆరోగ్య కుటుంబసంక్షేమ శాఖ జిల్లాఎయిడ్స్ నియంత్రణ విభాగం,శ్రీమేధ డిగ్రీ కళాశాల , విముక్తి ఎయిడ్స్ నివారణ మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్ ఫర్ హెచ్‌ఐవీ నివారణలో భాగంగా నగరంలోని కోటే ప్రాంతంలోని శ్రీమేధ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ నివారించదగిన వ్యాధి అని, హెచ్‌ఐవీ సోకిన వారు ఉపయోగించే సూదులు, సిరంజిలను ఇతరులకు వాడరాదన్నారు. హెచ్‌ఐవీ సంక్రమణ ఒక కళంకం, వివక్షత దాని వల్ల కలిగే మరణాలను సున్నాకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముఖ్యంగా యువత ఈ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో హెచ్‌ఐవీ గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జిల్లాను హెచ్‌ఐవీరహితంగా మార్చడమే లక్ష్యమన్నారు. ఆగస్టు 12 అంతర్జాతీయ యువజన దినోత్సవం హెచ్‌ఐవీ అవగాహన సందర్భంగా కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిభిరంలో 121 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు బైక్ హెల్మెట్లు పంపిణీ చేశారు. బైక్ ర్యాలీ ఎస్పీ సర్కిల్, కుమారస్వామి ఆలయం, సుధాక్రాస్, హెచ్‌ఆర్ గవియప్ప సర్కిల్ మీదుగా సాగింది. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌కిరణ్, జిల్లా ఆర్‌సీహెచ్‌అధికారి హనుమంతప్ప, డీఎస్ఓ డాక్టర్ గిరీశ్ కుమార్, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఫీల్డ్ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఖుర్షీద్ బేగం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించే విద్యను బోధించాలి

● వీఎస్కేయూ వైస్ చాన్స్‌లర్ మునిరాజు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ మునిరాజు

బళ్లారి సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉపాధి కల్పించే విద్యను బోధించాలని, పాఠ్యాంశాలను రూపొందించడంలో సాంకేతికతను ఉపయోగించుకోవాలని విజయనగర శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ఎం.మునిరాజు అన్నారు. విజయనగరం శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని జంతుశాస్త్ర విభాగంలో అండర్ గ్రాడ్యుయేట్ లెక్చరర్లకు జంతుశాస్త్రంలో పాఠ్యాంశాల మూల్యాంకనం , ప్రశ్నపత్రంపై ఒక రోజు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించి వారు మాట్లాడారు. రిసోర్స్ పర్సన్లుగా వచ్చిన రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ సురేశ్ , అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గోపాల్, పాఠ్యాంశాల నిర్మాణం, ప్రశ్నాపత్ర నిర్మాణం, మూల్యాంకనం వంటి అంశాలపై చర్చించారు. మూల్యాంకనం లేకుడా బోధన పూర్తికాదని పేర్కొన్నారు. తరువాత వారు బ్లూమ్స్ వర్గీకరణపై అనేక అంశాలపై ఉపన్యాసం ఇచ్చారు. ఈసందర్భంలో శశికాంత, నాగభూషణ్ .స్నేహ, సుమాహెగ్డే, మనోహర్, మహంతేశ్, విజయ గులాలకయ్య, పృథ్వీరాజ్, బైలారాణి, సుమలత, రుక్కమ్మతో పాటు వివిధ కశాళాలల అధ్యాపకులు పరిశోధక విద్యార్థులు ,ఎంఎస్సీ విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం

● రాష్ట్ర పర్యావరణ అధికారి సిద్దేశ్వర్ బాబు పిలుపు



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సిద్దేశ్‌బాబు

బళ్లారి సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గౌరీ గణేశ్ పండుగ భక్తి ఆరాధనల పండుగ పర్యావరణానికి హాని కలిగించకుండా, మట్టి గణపతుల ద్వారా జరుపుకోవాలని రాష్ట్రకాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ అధికారి టీ.ఎం. సిద్దేశ్వర్ బాబు అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, జిల్లాసంస్థ బళ్లారి, కర్ణాటక కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నగరంలోని స్కౌట్స్ అండ్ గైడ్ భవన్‌లో బుధవారం నిర్వహించిన పర్వారణ అనుకూల గణేశ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈసందర్భంగా రాష్ట్ర అసిస్టెంట్ ఆర్గనైజింగ్ కమిషనర్ కల్యాణ కర్ణాటక ఇన్‌చార్జి మల్లేశ్వరీ, జిల్లాస్కౌట్స్ అండ్ గైడ్ అసిస్టెంట్ మహ్మద్ షర్ఫుద్దీన్, నాగరాజు, చంద్రయ్య, స్కౌట్ మాస్టర్ అండ్ గైడ్ కెప్టెన్ వరలక్ష్మి, రాజ్యలక్ష్మీ, రేంజర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

మరో నవ జాత శిశువు లభ్యం..!

రాయచూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మాన్వి పట్టణంలో నవజాత శిశువు లభ్యమైన సంగతి ఆలస్యంగా వెలుగు చూసింది. మూడు రోజుల క్రితం మాన్వి పట్టణంలోని 19వ వార్డు పరనిధిలోగల చౌడేశ్వరి ఆలయ సమీపంలో మగ శిశువు పడి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పురసభ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పురసభ ఆరోగ్య విభాగం అధికారి మహేశ్ కుమార్ తన సిబ్బందితో వచ్చి శిశువును మాతా, శిశు సంరక్షణ ఆస్పత్రిలో చేర్చారు. కాగా శిశువు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అదే రోజు కల్మలా పట్టణంలో లభించిన శిశువును మగ స్థానిక వైద్యులు రిమ్స్ ఆస్పత్రికి తరలించగా ఆ శిశువు బ్రతికి ఉన్నట్లు తెలిసింది. ఈ రెండు శిశువులకు సంబంధించి తల్లిదండ్రులు, బంధువుల ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



లభించిన శిశువు



పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి శ్రీరాములు

విగ్రహ ప్రతిష్ఠలో మాజీమంత్రి శ్రీరాములు

బళ్లారి రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : బళ్లారి నగరంలో సిరుగుప్ప రోడ్డులో గురువారం జరిగిన గ్రామదేవత మదలకంటే యల్లమ్మదేవి ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీరాములు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆశీస్సులు అందరికీ ఉండాలని, నగర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సురేఖ మల్లనగౌడ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే భవనం నిర్మించాలని వినతి



ఎమ్మెల్యే భరత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

బళ్లారిరూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో కరాటే భవనం నిర్మించాలని సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డికి శ్రీ పంచాక్షరి మార్షల్ ట్రస్టు అధ్యక్షుడు బృందాల మృత్యుంజయ స్వామి తదితరులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరాటే భవనానికి వీలైనంత త్వరగా గ్రాంట్ విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బళ్లారి కాంగ్రెస్ యువనేత చానాల్ శేఖర్, కరవే అధ్యక్షుడు అంగడి శంకరప్ప, రాష్ట్ర అధ్యక్షులు మృత్యుంజయ, గంగావతి, వీరేష్, శబరి, రవిచంద్రన్, హుబ్లీ, రాజశేఖర్ గౌడ పాల్గొన్నారు.

సిరిగేరి ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



ఎస్ఐ శశిధర్‌ను అభినందిస్తున్న గ్రామస్థులు

కంప్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని సిరిగేరి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా శశిధర్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. సిరిగేరి సొసైటీ అధ్యక్షుడు సోమశేఖర్ మాజీ అధ్యక్షుడు నాగేంద్ర కన్నడ సాహిత్య పరిషత్ పూర్వ అధ్యక్షులు ఎస్ఎం నాగరాజు స్వామి, మాజీ తాలుకా పంచాయతీ సభ్యులు రేణుకప్ప, గ్రామ పంచాయతీ సభ్యులు రమేష్, కొరవర శివప్ప తదితరులు ఎస్ఐను అభినందించారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సదా హుస్సేని, టెక్కలకోటకి బదిలీ కావడంతో హచ్చొళ్లిలో వున్న శశిధర్ సిరిగేరికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడుతామని, ప్రజలు ఏ సమస్యలు వచ్చినా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. గ్రామంలోని ప్రజలు సహకరించినప్పుడే నేరాలను అరికట్ట వచ్చన్నారు.

వినాయక విగ్రహాలకు అనుమతి తప్పనిసరి

● శాంతి సభలో ఎస్పీ శోభారాణి



శాంతిసభలో మాట్లాడుతున్న ఎస్పీ శోభారాణి

కంప్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గణేశ చతుర్థి, ఈదుల్‌మిలాద్ నబీ పండుగలను హిందూ, ముస్లిం సమాజం వారు శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ శోభారాణి సూచించారు. గురువారం కంప్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన శాంతిసభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పట్టణాలు, గ్రామాల్లో ప్రతిష్ఠించే వినాయక విగ్రహాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. వినాయక మండపాల వద్ద డీజేలు ఏర్పాటు చేసి స్థానికులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ కలిసిమెలసి పండుగ జరుపుకోవాలని, రెచ్చగొట్టే పనులు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసాద్ గోఖలే, సీఐ వాసుకుమార్, ఎస్ఐ అవినాష్, నింబావలి గేటు తహసీల్దార్ షణ్ముఖప్ప, భీమేష్ పాల్గొన్నారు.

శాంతించిన తుంగభద్రమ్మ



కంప్లి కోట వంతెన వద్ద తగ్గిన నీటి ప్రవాహం

కంప్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : రెండు, మూడు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన తుంగభద్ర గురువారం కాస్త శాంతించింది. జలాశయం నుంచి నదికి నీరు విడుదల తక్కువ కావడంతో లోతట్టు ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. కంప్లి కోట వద్ద బ్రిడ్జిని తాకుతున్న నీరు తగ్గుముఖం పట్టింది. కోట వద్ద ఆంజనేయస్వామి దేవస్థానంలో నీరు తగ్గుముఖం పట్టింది. నదికి ఎక్కువగా నీరు పోటెత్తడంతో మత్స్యకారులు తెప్పలను గట్టుకు చేర్చారు. ఈ యేడాది గత మూడు నాలుగు సార్లు నదికి నీరు పోటెత్తడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులు పొలాల్లోకి వెళ్లాలన్నా తెప్పలపైన వెళ్లవలసిన అవసరం ఏర్పడింది. మొత్తానికి జలాశయంపై భాగంలో వర్షాలు తక్కువ కావడంతో నదికి నీరు కూడా వరద తక్కువైంది. కంప్లి వంతెనపై ఇంకా వాహనాలను అనుమతించడంలేదు.



కోట ఆంజనేయస్వామి ఆలయం వద్ద..



తెప్పల పైన పొలాలకు వెళ్తున్న రైతులు

హోసూరు జోన్

ఫ్లై ఓవర్‌కు మరమ్మతులు

హోసూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): హోసూరు బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారిపైగల ఫ్లై ఓవర్‌లో బేరింగ్‌ల అమరిక, పగుళ్లను సరిచేసే ప్రక్రియ చేపట్టారు. హైవేస్ డిపార్ట్‌మెంట్ అధికారులు గురువారం పరిశీలించారు. జూన్ 21న ఫ్లై ఓవర్‌కింద బేరింగ్ వంటిది దెబ్బతిన్నట్లు గుర్తించారు. భారీ వాహనాలు అకస్మాత్తుగా బ్రేక్‌లు వేయడంతో తలెత్తే ప్రభావమే కారణమని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. దీంతో రెండునెలలుగా వాహనాలను మళ్లించారు. ఎట్టకేలకు ఫ్లై ఓవర్‌కు అవసరమైన బేరింగ్‌లను సికింద్రాబాద్‌కు చెందిన సంస్థ సిద్ధం చేసింది. ప్రస్తుతం మరమ్మతుపనులు చేస్తున్నారు.



బేరింగ్‌లు బిగిస్తున్న సిబ్బంది

కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సదస్సు



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు

హోసూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): హోసూరు అడియమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నైపుణ్యాభివృద్ధి సదస్సు జరిగింది. తమిళనాడు స్కిల్ డెవలెప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ మెడిసిన్ ప్రతినిధులు డాక్టర్ శ్రీధర్ సరస్వతి, డాక్టర్ సాజు అబ్రహాం, జర్మనీలో ఉన్న ఐఎస్ఎంసీ వ్యవస్థాపకుడు, సీఈఓ ఇంగో షమిట్ట్ పాల్గొని నైపుణ్య ఆవశ్యకతను వివరించారు. ప్రతిభావంత విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణన్, వివిధ విభాగాధిపతులు, ప్రొఫెసర్‌లు, పాల్గొన్నారు.



ప్రమాదానికి గురైన బస్సు

టైరు పేలి అదుపు తప్పిన బస్సు

హోసూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బెంగళూరు - కృష్ణగిరి జాతీయ రహదారిపై ప్రైవేట్ బస్సుముందు టైరు అకస్మాత్తుగా పేలింది. దీంతో అదుపు తప్పిన బస్సు సర్వీస్‌రోడ్డును దాటి ఒక ఫ్యాక్టరీగోడను ఢీ కొంది. హోసూరులోని దర్గా వద్ద గురువారం ప్రమాదం చోటు చేసుకుంది. బస్సులో 25మంది ప్రయాణికులు ఉండగా 10మంది గాయపడ్డారు. సిప్‌కాట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు అందించారు. గాయపడినవారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదృష్టవశాత్తు బస్సు అదుపుతప్పినప్పుడు ఇతర వాహనాలు ఏవీ ఎదురుగా రాకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్లయ్యింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో బ్యాంకులో అగ్నిప్రమాదం

రాయచూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాయచూరు పట్టణంలోని బసవేశ్వర సర్కిల్ సమీపంలోని యూనియన్ బ్యాంక్‌లో గురువారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్క సారిగా బ్యాంక్‌లో మంటలు చెలరేగి దట్టంగా పొగలు అలుముకున్నారు. దీన్ని గమనించిన ఇరుగుపొరుగు వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వచ్చేలోగానే మంటలు పూర్తిగా బ్యాంకంతా వ్యాపించిన్నట్లు అధికారులు తెలిపారు. అప్పటికే ఫర్నీచర్, రెండు ఏసీలు పూర్తిగా కాలిపోగా ప్రమాదం గురించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. కాగా బ్యాంకులో కరెన్సీ ఏమైన అగ్ని ప్రమాదానికి గురైందా? ఇంకా ఏమైన నష్టం జరిగిందా అన్నదాని పై వివరాలు తెలియాల్సి ఉందని అగ్నిమాపక అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అగ్నిమాపక డీఎస్‌ఓ రవీంద్ర ఘాటగె,, అగ్నిమాపక స్టేషన్ అధికారి రాజు, అసిస్టెంట్ అధికారి నరసప్ప, సిబ్బంది డీకే శ్రీనివాస్, నాసీర్, నరసింహలు, దేవరాజ న్నారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది